సాక్షి విశాఖపట్నం

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు

అవగాహనతో క్యాన్సర్ దూరం

బీచ్‌రోడ్డులో క్యాన్సర్ అవగాహన నడక

ఏయూక్యాంపస్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సైతం వైద్య పరీక్షలు చేరువ కావాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. బీచ్‌రోడ్డులో ఆదివారం రోటరీ క్లబ్ వైజాగ్, క్వాంటమ్ స్పెషాలిటీ డయాగ్నస్టిక్స్ సంయుక్తంగా **నిర్వహించిన క్యాన్సర్ అవగాహన నడకను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె** మాట్లాడుతూ అక్టోబర్‌ను ప్రపంచ వ్యాప్తంగా రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవనం, ఆహారంలో వస్తున్న మార్పుల ఫలితంగా వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. క్వాంటమ్ ఫౌండర్ డాక్టర్ ఉపేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించడం సాధ్యమేనన్నారు. **ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఐ.వాణి** మిగతా 8వ పేజీలో

ఆదిమజాతుల ఆధిపత్య పోరే
కంగువా



- టికెట్ కొన్న ప్రేక్షకుడు సంతృప్తి చెందుతాడు
- సహజ సిద్ధ వెలుతురులోనే సినిమా చిత్రీకరణ
- హీరో చేతిపై గీతలు సాధించిన విజయాలకు గుర్తులు
- నగరంలోని ఓ హోటల్‌లో హీరో సూర్య వెల్లడి 8లో





లేజర్ అదుర్స్ షో

జీవీఎంసీ, తూర్పునావికాదళం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బీచ్ రోడ్డులోని విక్టరీ ఎట్ సీ స్థూపంపై సాగిన **సౌండ్ లేజర్ షో అబ్బురపరిచింది.** 1971 నౌకాదళ యుద్ధం, విశాఖ నగర పాత్ర, యుద్ధవీరుల సాహసాలు, దేశ భద్రత కోసం పహారా కాస్తున్న సైనికులు, దేశ చరిత్రను తెలిపే విధంగా ఈ లేజర్ షో సాగింది. పెద్ద సంఖ్యలో నగరవాసులు షోను వీక్షించారు. ప్రతీ ఆదివారం లేజర్ షో ఉంటుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు. –ఏయూక్యాంపస్



డి.హర్షిత



శివానీ లహరి

ఇద్దరూ.. ఇద్దరే!

8 కేంద్ర పాలిత ప్రాంతాలు.. 28 రాష్ట్రాలు.. 418 బృందాలు.. 2,000 మందికిపైగా విద్యార్థులు.. క్వార్టర్ ఫైనల్.. సెమీఫైనల్ వడపోతలు.. చివరిగా మిగిలింది 124 మంది విద్యార్థులు.. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైంది నలుగురు.. అందులో ఏపీ నుంచి.. అదీ విశాఖ నుంచి ఫైనల్‌కు చేరింది ఇద్దరే.. వారే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన శివానీ లహరి, హర్షిత.

నేషనల్ యూత్ ఫెస్ట్‌కి ఎంపికైన శివానీ, హర్షిత

- ప్రజా అర్బన్ గవర్నెన్స్‌లో విశాఖకి చోటు దక్కేలా ప్రాజెక్ట్
- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యాప్ తయారు చేసిన అమ్మాయిలు
- నో యువర్ వార్డ్ పేరుతో ఏఐ ఆధారిత గ్రీవెన్స్ యాప్
- నవంబర్ 16న లక్నోలో జరగనున్న ఫెస్ట్‌కు సిద్ధమవుతున్న శివానీ, హర్షిత



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, కళాశాల బృందం

సాక్షి, విశాఖపట్నం: మార్పు మన నుంచే ప్రారంభం కావాలి. మరికొంతమందిలో ఆ మార్పు తీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నం చేయాలి. తమ ప్రయత్నంతో కొంతమందిలోనైనా మార్పు వస్తే.. చాలనుకుంటారు నేటి యువతరం. ఆ కోవకు చెందిన వారే ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో బీఏఎల్ఎల్‌బీ థర్డ్ ఇయర్ చదువుతున్న ఎం.శివానీ లహరి, డి.హర్షిత. తమ ఆలోచనలను పంచుకునే వేదిక కోసం ఎదురు చూసిన వీరు ఇప్పుడు దొరికిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఐక్యరాజ్యసమితి (యూఎన్-హాబిటేట్) సహకారంతో కేంద్ర ప్రభుత్వ అనుబంధంగా నడుస్తున్న ప్రజా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏటా జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది కూడా 'ప్రజాతంత్రం-2024' పేరుతో 'సెలబ్రేటింగ్ సిటీగవర్నెన్స్ ఇన్ ఇండియా' అనే థీమ్‌తో నేషనల్ యూత్‌ఫెస్ట్‌కు శ్రీకారం చుట్టింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వందల విద్యా సంస్థల నుంచి 2,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని సామాన్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన అస్త్రంగా శివానీ, హర్షిత చేసిన ఉపన్యాసాలు ఫైనల్‌కు తీసుకెళ్లాయి.


తెలుగు రాష్ట్రాల నుంచి హర్షిత మాత్రమే..

ఈ పోటీలకు ఏయూ నుంచి 8 మందితో కూడిన బృందం దరఖాస్తు చేసుకుంది. ఆగస్ట్ 30 నుంచి సెప్టెంబర్ 1 వరకూ జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఇండివిడ్యువల్ ఫెర్ఫార్మెన్స్‌పై ఆన్‌లైన్‌లో డిబేట్ నిర్వహించారు. ఇందులో మేయర్‌తో కూడిన అర్బన్ బాడీ వ్యవస్థలో చర్చోపచర్చలు నిర్వహించారు. ఇందులో డి.హర్షితకు పాలసీ వ్యవహారాలపై మాట్లాడేందుకు ఎంపిక చేశారు. నగరంలో జరుగుతున్న వ్యవహారాలపై ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తూ హర్షిత చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. ఈ ప్రతిభతో 207 మందితో కలిసి సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్‌లో సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంపై అధికార పక్షంలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే అంశంపై చర్చ జరిగింది. ఈ చర్చలోనూ హర్షిత అదరగొట్టి.. ఫైనల్‌కు ఎంపికైంది. మొత్తం 18 మంది ఫైనల్‌కు ఎంపికవ్వగా.. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఎంపికవ్వగా తెలుగు రాష్ట్రాల నుంచి ఫైనల్‌కు చేరుకున్న ఏకైక విద్యార్థి హర్షిత మాత్రమే కావడం విశేషం.

నో యువర్ వార్డ్ యాప్‌తో...

వీరిద్దరూ తమ బృందంతో కలిసి నగర ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన యాప్‌ను డిజైన్ చేశారు. దీనికి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన ప్రజెంటేషనే వీరిద్దర్నీ ఫైనల్‌కు తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సహకారంతో సాధారణ ప్రజలు కూడా తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడం, సమస్యలు విభజించి ఆయా అధికారులకు నేరుగా వెళ్లేలా 'నో యువర్ వార్డ్' పేరుతో రూపొందించిన యాప్ న్యాయనిర్ణేతలకు తెగ నచ్చేసింది. నవంబర్ 16 నుంచి 18 వరకు లక్నోలో జరిగే ఫైనల్‌లో యాప్‌ని ప్రదర్శించాలని ప్రజా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు.





యాప్‌లో ప్రజా సమస్యల వినతుల గ్రాఫ్

చర్చలో.. సూపర్ శివానీ.!

ఎం.శివానీ లహరి ప్రతిభకు ప్రజాతంత్ర న్యాయ నిర్ణేతలు ఆశ్చర్యపోయారు. చిట్టీలు తీసి టాపిక్ ఎంపిక చేసి.. దానిపై మాట్లాడాలని శివానీకి చెప్పారు. సామాన్య ప్రజల్ని పరిపాలనలో ఎలా భాగస్వామ్యం చేస్తారనే అంశంపై టాపిక్ వచ్చింది. ఇందులో ఎలాంటి స్థిరమైన విధానాలు అవలంబించాలనే విషయాన్ని ప్రజెంట్ చేసింది. బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఎలాంటి అవకాశాలు కల్పించాలనే అంశంపై మాట్లాడుతూ అదరగొట్టింది. మొత్తం 150 మంది పాల్గొనగా.. శివానీతో సహా 80 మంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. సెమీస్‌లో పట్టణ ప్రజలకు పథకాలు, సంక్షేమం, పరిపాలనని ప్రజలకు ఎలా చేరువ చేయాలనే అంశాలపై శివానీ లహరి చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. పాలసీ డాక్యుమెంట్ రూపొందించే విధానంపై శివానీ చేసిన ప్రజెంటేషన్ ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌కు మొత్తం 16 మంది చేరుకోగా ఏపీ, తెలంగాణ నుంచి ఇద్దరు సెలెక్ట్ అయ్యారు. ఇందులో ఏపీ నుంచి శివానీ లహరి ఎంపికవ్వడం గమనార్హం.

క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం..

ఫైనల్‌కు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ఫైనల్‌లో యూఎల్‌బీకి సంబంధించిన సమగ్ర సమాచారం, ప్రజల నుంచి అభిప్రాయాలతో కూడిన వివరాలు సబ్‌మిట్ చేయాలి. ఇందు కోసం క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించాం. నవంబర్ 1 వరకూ జీవీఎంసీ పరిధిలో ఉన్న అన్ని వర్గాల వారి దగ్గర నుంచి సమాచారం సేకరిస్తాం. ప్రజాఫౌండేషన్ వద్ద ఏపీ నుంచి విజయవాడకు చెందిన సమాచారం మాత్రమే ఉంది. మరే ఇతర నగరానికి చెందిన ఇన్ఫో లేదు. అందుకే మేం చేసే క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలతో ప్రత్యేకమైన హ్యాండ్‌బుక్ సిద్ధం చేసి అందించాలని నిర్ణయించాం. ఈ సమాచారంతో కూడిన వివరాలు ప్రజా ఫౌండేషన్ ఎన్‌జీవో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ ఇండియా తమ వెబ్‌సైట్‌లో విశాఖకు చోటు కల్పించనున్నారు.

– శివానీ లహరి, నేషనల్ యూత్‌ఫెస్ట్ ఫైనలిస్ట్

యాప్‌తో ఎన్నో ఉపయోగాలున్నాయి

ఫైనల్స్‌కు ఎంపికవ్వడానికి ప్రధానమైంది మేం రూపొందించిన యాప్. క్వార్టర్స్, సెమీస్‌లో ఒక్కొక్కరికీ 5 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారు. యాప్ గురించి చెప్పిన తర్వాత మాకు అదనంగా మరో 3 నిమిషాలు కేటాయించారు. అప్పుడే మేం విజయం సాధించినంత ఆనందం వేసింది. ఈ యాప్ డిజైన్‌కు ఎంతో మంది సహకరించారు. ఏఐ సాంకేతికతతో బేసిక్ ఫోన్స్ ఉన్న వారు కూడా యాప్‌ని ఉపయోగించేలా కోడ్ రూపొందిస్తున్నాం. అంటే బేసిక్ ఫోన్ నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమస్య చెప్పినప్పుడు అది యాప్‌లోకి జనరేట్ అయిపోతుంది. అప్పుడు సమస్య అధికారులకు చేరుకునేలా డిజైన్ చేశాం. సర్వే పూర్తయిన తర్వాత మేం నో యువర్ వార్డ్ యాప్ సిద్ధం చేస్తాం. ఫైనల్‌లో ఈ యాప్ మమ్మల్ని గెలిపిస్తుందని నమ్ముతున్నాం.

–డి.హర్షిత, నేషనల్ యూత్‌ఫెస్ట్ ఫైనలిస్ట్

సీ విజిల్.. రెడీ.!

మత్స్యకారుల రూపంలో అక్రమంగా చొరబడి.. యావత్ భారతావని భీతిల్లేలా దాడులకు తెగబడిన ఉగ్రమూక దాష్టీకం గుర్తొస్తే ప్రతి భారతీయుడూ కన్నీటి పర్యంతమవుతాడు. భారత తీర రక్షణ వ్యవస్థకు సవాల్ విసిరిన 26/11 దాడుల తర్వాత ఆయా రక్షణ విభాగాలు ఉక్రోషంతో ఊగిపోయాయి. మరోసారి 26/11 తరహా దాడి ఘటన దేశంలో ఏ మూలా జరగకూడదంటూ ప్రతినబూనాయి. తీర రక్షణ వ్యవస్థను పటిష్టం చేసి తీవ్రవాదులకు సవాల్ విసిరాయి. యావత్ ప్రపంచానికి దేశ రక్షణ శక్తిని చాటి చెప్పేందుకు ఏటా రెండు రోజుల పాటు సమర సన్నద్ధ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో సీ విజిల్-2024 నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- తీర ప్రాంత పరిరక్షణ కోసం కోస్టల్ ఎక్సర్‌సైజ్
- నవంబర్‌లో విశాఖ కేంద్రంగా సీ విజిల్ నిర్వహణ
- తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు
- 26/11 దాడుల తర్వాత నుంచి ఏటా నిర్వహణ



సీ విజిల్ విన్యాసాలకు సిద్ధమవుతున్న భారత రక్షణ వ్యవస్థ

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళం, తీరగస్తీ దళం, మెరైన్ పోలీస్ వ్యవస్థలు 2018 నుంచి ఏటా రెండు రోజుల పాటు 'సీ విజిల్' పేరుతో సమర సన్నద్ధ విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నవంబర్ 20, 21వ తేదీల్లో సీ విజిల్-2024 పేరుతో 5వ ఎడిషన్ యుద్ధ విన్యాసాలు జరగనున్నాయి. సముద్ర తీర రేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పుదుచ్చేరి సహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 7,516.6 కిలోమీటర్ల పొడవునా విన్యాసాల ప్రదర్శన ఏర్పాట్లు ఇప్పటికే ఓ కొలిక్కివచ్చాయి. రక్షణ మంత్రిత్వ శాఖతో పాటు హోం, షిప్పింగ్, పెట్రోలియం, సహజ వాయువులు, కస్టమ్స్, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు ఈ విన్యాసాలకు సహకారం అందిస్తున్నాయి. ఇండియన్ నేవీ, కోస్టుగార్డ్, మెరైన్ పోలీసు బృందాలు ద్వీపాల్లో, సముద్ర మధ్య ప్రాంతాలు, మత్స్యకారుల బోట్లు ఒడ్డుకు చేరే ప్రాంతాల్లో విన్యాసాలు నిర్వహించనున్నాయి.

50 నౌకలు.. 100 పెట్రోలింగ్ బోట్లు

అంతర్ రాష్ట్ర ఏజెన్సీల సమన్వయం, సమాచార భాగస్వామ్యం, సాంకేతిక పర్యవేక్షణలో నేవీ, కోస్ట్ గార్డ్‌కు చెందిన 50 నౌకలతోపాటు 100 పెట్రోలింగ్ బోట్లు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. వీటితో పాటు యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, సబ్‌మెరైన్‌లు ఇలా మొత్తం 500 వరకు ఈ విన్యాసాల్లో భాగస్వామ్యం కానున్నాయి. తొలి రోజున విశాఖ సహా ప్రతి తీరానికి ఐదు మైళ్ల దూరం వరకూ నిఘా వ్యవస్థను పటిష్టం చేసేలా మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. విశాఖపట్నం పోర్టు సమీపం, పారాదీప్ కేజీ బేసిన్ వద్ద మత్స్యకారుల రూపంలో ఉగ్రవాదులు చొరబడేందుకు ప్రయత్నించడం.. వారిని రక్షణ బలగాలు గుర్తించి అదుపులోకి తీసుకోవడం మొదలైన విన్యాసాలు జరగనున్నాయి.

విశాఖలో ప్రధాన ప్రణాళిక సమావేశం

విశాఖలోని తూర్పు నౌకాదళం ప్రధాన స్థావరంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్(డీసీఎన్ఎస్) వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి అధ్యక్షతన ఆదివారం కోస్టల్ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్ సీ విజిల్-2024 ఏర్పాట్లపై ప్రధాన ప్రణాళిక సమావేశం జరిగింది. ఈ విన్యాసాల్లో భాగస్వామ్య విభాగాలైన ఇండియన్ నేవీ, కోస్టుగార్డ్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), స్టేట్ మెరైన్ పోలీస్, ఫిషరీస్, కస్టమ్స్, ఇంటెలిజెన్స్ బ్యూరో సహా అన్ని సముద్ర సంబంధ స్టేక్ హోల్డర్స్ సంసిద్ధతను తెలియజేసేలా సమీక్ష జరిగింది. ఇంటెలిజెన్స్ బ్యూరో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ లైట్ హౌస్, లైట్‌షిప్స్(డీజీఎల్ఎల్), ఆయిల్ ఆపరేటర్లు, ఇతర కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు కలిసి భద్రతా సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై చర్చించారు. విన్యాసాల నిర్వహణకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వైస్ అడ్మిరల్ సోబ్తి సూచించారు. త్వరలో తుది సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. జాతీయ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఈ తరహా విన్యాసాలను నిరంతరం నిర్వహిస్తామని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.



సన్నాహక సమీక్షలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర రక్షణ విభాగాల అధికారులు

రైతుకు.. ఆ తర్వాత డివైడర్‌కు..

బైక్‌తో ఢీకొట్టిన యువకుడు

- రైతు, యువకుడి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



చిట్టిబాబు(ఫైల్)





చిట్టిబాబు, యువకుడి మృతదేహాలు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కోరాడ చిట్టిబాబు(68) అనే రైతుతో పాటు ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడు మోహన్‌సాయి తీవ్రగాయాలతో సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రత్యక్ష సాక్షులు, ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. గుమ్మడివానిపాలేనికి చెందిన రైతు వ్యవసాయ పనులు చూసుకుని ఇంటికి వచ్చేందుకు 6 గంటల సమయంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఆనందపురం నుంచి పెందుర్తి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మోహన్‌సాయి, మరో యువకుడు అదుపు తప్పి ముందుగా రైతును, ఆ తర్వాత సర్వీస్ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రైతు చిట్టిబాబు, ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మోహన్‌సాయికి హెల్మెట్ ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. చిట్టిబాబుకు భార్య నారాయణమ్మతో పాటు పెళ్లయిన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుల వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడు తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

ఆలోచనే పెట్టుబడి



అక్వేరియంలు విక్రయిస్తున్న యువకులు

ఏయూక్యాంపస్: ఆలోచనే వారికి పెట్టుబడి అయింది. లక్ష్య సాధనకు దారి చూపింది. ఇంజినీరింగ్ చదువుతున్న మోషే, సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న దినేష్, డిప్లమో చేసిన సతీష్ స్నేహితులు. సొంత కాళ్లపై నిలబడాలనే ఆకాంక్షతో..తమకొచ్చిన ఆలోచనకు రూపం కల్పించారు. కేవలం వాటర్ బాటిల్ సైజులో ఉండే అక్వేరియంలు రూపొందించి విక్రయించడం ప్రారంభించారు. రెండు వారాలుగా బీచ్‌రోడ్డులో వీటిని విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇందుకు అవసరమైన వస్తువులు, చేపలను కొనుగోలు చేస్తున్నారు. అందంగా కనిపించే బీటా ఫిష్(ఫైటర్‌ఫిష్)తో కూడిన చిన్న అక్వేరియం, ఆహారంతో కలిపి రూ 220కి విక్రయిస్తున్నారు. నగర వాసు లు, పర్యాటకులు వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎవరికైనా బహుమతిగా ఇవ్వడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. వీటిని నిర్వహించడం, శుభ్రం చేయడం సులభం కావడంతో వీటిని కొనుగోలు చేస్తున్నారు. చిన్న ఆలోచనను వ్యాపార అవకాశంగా మలుచుకుని సమాజంలో ధైర్యంగా అడుగులేస్తున్న ఈ యువకుల సంకల్పానికి హ్యాట్సాఫ్!



చేతితో తీసుకువెళ్లే అక్వేరియం

● కలువల కనువిందు




హేమంత రుతువును స్వాగతిస్తూ.. ఎండాడ చెరువులో వికసించిన కలువలు కనువిందు చేస్తున్నాయి. నిశ్చల కొలనుపై పెద్ద పెద్ద ఆకుల మధ్య వర్ణాల పుష్పాలు విచ్చుకున్నాయి. నీలిరంగు నీటి అందాల్ని తనలో నింపుకుంటూ.. ఆకాశాని కేసి చూస్తున్న కలువ పూల సోయగం.. అటుగా వెళ్తున్న వారందరినీ ఇట్టే కట్టిపడేస్తోంది. ప్రకృతి గీసిన ఈ కలువ కొలనులో తూనీగల సయ్యాటలతో సరికొత్త అందాలు ఆవిష్కృతమయ్యాయి.

● కటిక నేలే పూలపాన్పు



ఆకలి రుచెరగదు.. నిద్ర సుఖమెరుగదు అని అంటారు. ఆకలి వేసినప్పుడు ఏదైనా తిండి ఎంతో రుచిగా అనిపించినట్లే.. బాగా అలసినప్పుడు కటిక నేల మీద పడుకున్నా హాయిగా నిద్ర పడుతుంది. ఉదయం నుంచి ఎండలో కష్టపడి పనిచేసిన ఇద్దరు మహిళా కూలీలు.. మధ్యాహ్నం వేళ ఎండాడ చెరువు వద్ద కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటున్న దృశ్యం స్థానికులను కదిలించింది. కష్టపడే వారి జీవితాల గురించి ఆలోచింపజేసేలా చేసింది.

● పరుచుకున్న పచ్చదనం



దట్టంగా పరుచుకున్న పచ్చదనం గ్రామీణ, శివారు ప్రాంతంలోనిది కాదు.. నగర నడిబొడ్డున సర్క్యూట్ హౌస్ వద్ద భూమికి పచ్చని చీర కట్టినట్లు ఉంది కదా ఈ చిత్రం! ఎత్తైన భవనాలు, రద్దీ వాహనాలు, కాలుష్యంతో నిండిపోయిన నగరంలో ఇలాంటి దృశ్యం ఆశ్చర్యకరమే.. ప్రైవేట్ స్కూల్ భవంతి చుట్టూ విస్తరించిన పచ్చదనం కనులకు ఇంపుగా ఉంది.

● కాలుష్య పో(ర్టు)టు



కాలుష్యానికి కేరాఫ్‌గా పోర్టు రోడ్డు మారిపోయింది. దశాబ్దాలు గడుస్తున్న కాలుష్యానికి మాత్రం చెక్ పడడం లేదు. సీహార్స్ జంక్షన్ నుంచి పోర్టు పరిపాలన భవనం వైపు వెళ్లే రోడ్డులో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అటుగా వెళ్లే వారి ముఖాలు పొగచూరుకుంటున్నాయి. వేసుకున్న దుస్తులు నల్లగా మారిపోతున్నాయి. వాస్తవానికి ప్రతి మూడు గంటలకు ఒకసారి ఆ రహదారులపై నీళ్లు చల్లి దుమ్ము రేగకుండా చూడాలి. అలా చేయకపోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో విపరీతంగా దుమ్ము,ధూళి వ్యాపిస్తోంది.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విశాఖలో విజయశాంతి



లొకేషన్‌లో నటి విజయశాంతి

కొమ్మాది: విశాఖలో లేడీ సూపర్‌స్టార్, సీనియర్ నటి విజయశాంతి ఆదివారం సందడి చేశారు. నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్న ఓ చిత్రంలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి యారాడ బీచ్, ఆర్.కె.బీచ్ ప్రాంతాల్లో ఆమెపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఆదివారం కావడంతో షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున సినీ అభిమానులు అక్కడకు చేరుకున్నారు. మరో మూడు రోజుల పాటు భీమిలి–విశాఖ బీచ్ ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ ఉంటుందని యూనిట్ తెలిపింది.

క్రీడాకారులు రాణించాలి



పరుగు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: వెటరన్ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ట్రాక్, ఫీల్డ్ అంశాల్లో 30 నుంచి 80 ఏళ్ల వరకు వయసుల వారీగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు అదనపు డీసీపీ(క్రైం) ఎం.మోహనరావు బహుమతులు ప్రదానం చేసి.. అభినందించారు. విశాఖ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కాగా.. 5 కిమీ నడక, వంద మీటర్ల నుంచి ఐదు వేల మీటర్ల వరకు పలు స్థాయిల్లో పరుగు, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో తదితర అంశాల్లో పోటీలు జరిగాయి.

ఆంధ్ర 344 ఆలౌట్

- హిమాచల్‌ప్రదేశ్ 4 వికెట్లకు 198 పరుగులు
- అంకిత్, ఆకాష్ అర్ధసెంచరీలు

విశాఖ స్పోర్ట్స్: రంజీట్రోఫీ ఎలైట్ బీ గ్రూప్‌లో భాగంగా హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడిన ఆంధ్ర 344 పరుగులకు తొలి ఇన్నింగ్స్ ముగించింది. హిమాచల్ ప్రదేశ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు చేతిలో ఉండగా 146 పరుగులు వెనుకబడి ఉంది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం ఆరు వికెట్లకు 295 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆట కొనసాగించిన ఆంధ్ర జట్టు మరో 12.4 ఓవర్ల పాటు ఆడి 48 పరుగులు జోడించి ఆలౌటైంది. రెండో రోజు ఆటను కొనసాగించిన జి.మనీష్(42) శర్మ బౌలింగ్‌లో నేగికి క్యాచ్ ఇవ్వగా, విజయ్(33) ధావన్ బౌలింగ్‌లో వశిష్ఠ్‌కి క్యాచ్ ఇచ్చి వెనక్కి మళ్లాడు. శశికాంత్(6), లలిత్ మోహన్(24) ఇద్దరూ శర్మ బౌలింగ్‌లో కీపర్ శుభమ్‌కు క్యాచ్‌లిచ్చి పెవిలియన్ దారి పట్టారు. ఎక్స్‌ట్రాల రూపంలో 24 పరుగులు అదనంగా చేరాయి. దివేష్ శర్మ ఐదు, రిషి ధావన్ మూడు వికెట్లు తీశాడు. ముకుల్ నేగి, గులేరియా చెరో వికెట్ తీశారు.

ప్రతిగా హిమచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ ప్రారంభించి ఓపెనర్ల వికెట్లను 31 పరుగులకే కోల్పోయింది. ఎస్‌జీ అరోరా 16 పరుగులు చేయగా, పీఎస్ చోప్రా 10 పరుగులు చేశాడు. వీరిద్దరూ శశికాంత్ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు క్యాచ్‌లిచ్చి పెవిలియన్ పట్టారు. అంకిత్(53) అర్ధసెంచరీ చేసి విజయ్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డయ్యాడు. ఏకాంత్ సేన్ (20) వికెట్‌ను శశికాంత్ కూల్చాడు. కెప్టెన్ రిషి ధావన్(38), అర్ధసెంచరీ చేసిన ఆకాష్ వశిష్ఠ్(52) జోడీ ఐదో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో కొనసాగుతున్నారు. ఆట మరో రెండు రోజులు సాగనుంది.



బ్యాటింగ్ చేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ ఆటగాడు

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేటి నుంచి జోనల్ స్థాయి సైన్స్ ఫేర్

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సోమ, మంగళవారాల్లో జోనల్ స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శాంతికుమారి చెప్పారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని.. కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో పాటు ప్రజా ప్రతినిధులు హాజరై ప్రారంభిస్తారన్నారు.

అవగాహనతో క్యాన్సర్ దూరం



ర్యాలీలో ఎమ్మెల్యే మాధవి, సభ్యులు

▶7వ పేజీ తరువాయి

మాట్లాడుతూ మహిళలు ఏటా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కేజీహెచ్‌లో ప్యాప్ స్మియర్, మోమోగ్రామ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ ఎండీ కల్పనా కుమారి, క్వాంటమ్ చైర్మన్ డాక్టర్ సుష్మ, డి.ఎం రావు, త్రినాథ్, జీఎం నారాయణ, రోటరీ క్లబ్ ప్రతినిధులు కంటిపూడి వెంకటేశ్వర రావు, శోభన్ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది.

బీచ్‌రోడ్డు జనసంద్రం

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డు జనసంద్రంలా మారింది. ఆదివారంతో పాటు నోవాటెల్ ఎదురుగా హీరో సూర్య కొత్త మూవీ కంగువా మెగా ఈవెంట్, విక్టరీ ఎట్ సీ వద్ద సౌండ్ లేజర్ షో కార్యక్రమాలు జరిగాయి. వీటిని తిలకించడానికి వచ్చిన సందర్శకులు, నగరవాసులతో బీచ్‌రోడ్డు నిండిపోయింది. సందర్శకులు తమ వాహనాలకు రోడ్డు పక్కనే నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు నానాతంటాలు పడుతూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మరోవైపు భారీ సంఖ్యలో నగరవాసులు, పర్యాటకులు బీచ్‌ను సందర్శించారు. కుటుంబ సభ్యులతో సాగరతీరంలో ఫొటోలు తీసుకుంటూ.. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.



బీచ్‌రోడ్డులో నిలిచిన వాహనాలు

ఆదిమజాతుల ఆధిపత్య పోరే కంగువా



మాట్లాడుతున్న సినీ నటుడు సూర్య

ఏయూక్యాంపస్: టికెట్ కొని కంగువా సినిమా చూసిన ప్రతీ ప్రేక్షకుడు సంతృప్తి చెందుతాడని హీరో సూర్య అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సినిమా మొత్తం సహజసిద్ధమైన వెలుతురులోనే చిత్రీకరణ జరిగిందన్నారు. వేలాది మంది కష్టం, ప్రేమ ఫలితమే కంగువా సినిమా అన్నారు. వందల సంవత్సరాల క్రితం ఐదు ఆదిమజాతి సమూహాల మధ్య జరిగిన ఆధిపత్య పోరును కథగా దర్శకుడు ఎంతో శ్రమించి చిత్రీకరించారన్నారు. ఈ చిత్రాన్ని 3డీ లో కూడా విడుదల చేస్తున్నామన్నారు. చిత్రంలో చాలా ఎమోషన్స్ ఉంటాయన్నారు. దేవీశ్రీ ప్రసాద్ మంచి సంగీతాన్ని అందించారన్నారు. ఈ చిత్రానికి అన్ని భాషల వారు కలిసి పనిచేసినట్లు తెలిపారు. బాబీడియోల్ పాత్ర, నటన ఈ చిత్రానికి మరింత బలాన్ని అందించిందన్నారు. దాదాపు రెండు గంట ల సినిమా వందల ఏళ్ల క్రితం నాటిదని, కేవలం 20 నిమిషాల కథ ప్రస్తుత కాలానికి సంబంధించినదిగా ఉంటుందన్నారు. నవంబర్ 14న చిత్రం విడుదల చేస్తున్నామన్నారు. హీరో చేతిపై ఉండే గీతలు అతను సాధించిన విజయాలకు గుర్తులని వెల్లడించారు.

రూ.750 జీతంతో ఉద్యోగం చేశా..

తాను తొలిసారిగా రూ.750 జీతంతో ఉద్యోగంలో చేరానని, తన డెస్టినీ ఈ దిశగా నడిపించిందన్నారు. పెద్దకొడుకుగా బాధ్యత తీసుకుని ఉద్యోగం చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తాను హీరో అవ్వాలని అనుకోలేదన్నారు. కాక కాక, జై భీమ్ వంటి చిత్రాలు సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపాయన్నారు. జై భీమ్ చిత్రం తరువాత తమిళనాడులో 3 లక్షల మందికి ఇంటి పట్టాలు లభించాయన్నారు. సమాజంపై ప్రభావం చూపే చిత్రాలు ఎప్పుడూ ప్రత్యేకమన్నారు. తన జీవిత భాగస్వామి జ్యోతికతో కలిసి ఒక చిత్రం చేయాలని అనుకుంటున్నాని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

కొత్త అనుభూతి పొందుతారు..

చిత్ర నిర్మాత జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ తెలుగు, తమిళ ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ తమ చిత్రం దాదాపు రూ.2 వేల కోట్లు వసూలు చేసేటంత ధైర్యాన్నిస్తోందన్నారు. ఇది మా అందరి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందన్నారు. దర్శక దిగ్గజం రాజమౌళి గ్లోబల్ ఫిల్మ్ ఎలా తీయాలో చూపారని, పాన్ ఇండియా చిత్రాన్ని తాము నిర్మిస్తున్నామన్నారు. కొత్త అనుభూతిని, ప్రపంచాన్ని ప్రేక్షకులు ఈ చిత్రంలో చూస్తారన్నారు. కేజీఎఫ్ నటుడు అవినాష్ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఈ చిత్రం తనదే అన్న ఫీలింగ్‌తో పనిచేశారన్నారు. ప్రతి క్షణం మారిపోయే వాతావరణం, కొడైకెనాల్‌లో చేసిన చిత్ర షెడ్యూల్ ఎంతో ప్రత్యేకమని, ఇవి గుర్తుండి పోతాయన్నారు.

కంగువా వైజాగ్ మెగా ఈవెంట్

బీచ్‌రోడ్డులో కంగువా వైజాగ్ మెగా ఈవెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో హీరో సూర్య, దర్శకుడు శివ, నిర్మాత జ్ఞానవేల్, సినీ నటుడు సందీప్ కిషన్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హీరో సూర్య మాట్లాడుతూ అమ్మ ప్రేమంత విలువైనది అభిమానుల ప్రేమ అని అన్నారు.

విశాఖతో గొప్ప బంధం

విశాఖ నగరంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. 2015–16లో ఇక్కడే సింగం సినిమా చిత్రీకరణ చేశామన్నారు. ఇక్కడి ప్రజలు చూపించిన ప్రేమ మరువలేనిదన్నారు. ఎప్పుడూ నా సినిమా షూటింగ్‌కి రాని అమ్మ, నాన్న, నా పిల్లలు సైతం విశాఖ వచ్చారన్నారు. తన చిన్నతనంలో కమల్‌హాసన్‌ని ఇష్టపడే వాడినని, తరువాతి కాలంలో అందరు నటులనూ చూసి ప్రేరణ పొందుతున్నానన్నారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు శరవణన్ అని అది నేడు సూర్యగా మారిపోయిందని, ఇదంతా అందరి ప్రేమతోనే సాధ్యపడిందన్నారు.

గైనిక్ కేర్ హబ్‌గా విశాఖ

- నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి
- వివిధ రకాల క్యాన్సర్లపై విస్తృత అవగాహన
- ప్రసూతి, స్త్రీల వైద్యుల ప్రాంతీయ సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మధురవాడ: గైనిక్ కేర్ హబ్‌గా విశాఖ ఉందని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలతో సమానంగా విశాఖలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మధురవాడ వీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన విశాఖ ప్రసూతి, స్త్రీల వైద్యుల సొసైటీ (ఓజీఎస్‌వీ) 58వ ప్రాంతీయ వార్షిక సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రమాదకరంగా మారుతున్న అండాశయ క్యాన్సర్, పీసీవోడీ, గర్భాశయ క్యాన్సర్లపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణపై కూడా అవగాహన పెంచాలన్నారు. స్త్రీలపై హింస, ఊటీలో ఉన్న స్త్రీల వైద్యులపై దాడులు క్షమించరానివన్నారు. ఇప్పటికీ సమాజంలో స్త్రీలు, బాలికలపై చిన్నచూపు ఉందని, వారి ఆరోగ్య సమస్యలకు కూడా అంతప్రాధాన్యత లభించడం లేదన్నారు. మారుమూల, గ్రామీణ ప్రాంతాలలో టెలీ మెడిసన్, ఇతర పద్ధతులు ద్వారా వైద్య సలహాలు ఇచ్చే ఏర్పాట్లు చెయ్యాలన్నారు. గౌరవ అతిథి ఎఫ్‌వోజీఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జయదీప్ టాంక్ మాట్లాడుతూ వైద్యుల ముందున్న సవాళ్లు, వివిధ రకాల వైద్య విధానాలు గురించి వివరించారు. వైద్య చట్టాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. డాక్టర్ జీఏ రామరాజు ఐవీఎఫ్‌లో నూతన వైద్యవిధానాలను వివరించారు. ఓజీఎస్‌వీ అధ్యక్షుడు డాక్టర్ వైఎల్ నరసింగరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ కిరణ్మయ్ గొట్టాపు, వైద్యులు ఐ.వాణి, సంధ్యా దేవి, స్వామిని, గీతావందన, పద్మావతి నాయుడు, శిరీషరాణి, విద్యారమ తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. సీనియర్ వైద్యులు శశిప్రభ, కృష్ణమ్మ, సుబ్బరాజు, టి. రాధ, టి. పద్మావతి, సీతారామరాజుతో పాటు కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కళాశాల వైద్యులు పాల్గొన్నారు.

రూ. 28 కోట్లతో కేజీహెచ్‌లో క్యాన్సర్ విభాగం ఆధునికీకరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

మహారాణిపేట: కేజీహెచ్‌లో క్యాన్సర్ రోగులకు ఉచిత చికిత్స అందజేస్తున్నామని, ఇందులో భాగంగా క్యాన్సర్ విభాగాన్ని ఆధునికీకరించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం 30వ వార్డు సాలిపేట కమ్యూనిటీ హాల్లో చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ అవగాహన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగంలో రూ. 28 కోట్ల వ్యయంతో అధునాతన సాంకేతిక పరికరాలైన లినాక్ మిషన్ సమకూర్చుకోగలిగినట్లు చెప్పారు. దీని సాయంతో ఐదు నుంచి పది లక్షల రూపాయలు ఖర్చు కాగల వైద్యాన్ని కేజీహెచ్‌లో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. రొమ్ముల్లో గడ్డలు ఏర్పడిన సందర్భంలో నొప్పి ఉన్నా లేకపోయినా మెమోగ్రామ్ పరీక్ష చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుందని తెలిపారు. త్వరలో రొమ్ము క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, దీన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ క్యాన్సర్ నాలుగు స్టేజిల్లో ఉంటుందని తెలిపారు. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తిస్తే నయం అవుతుందన్నారు. చైతన్య ప్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా వివిధ వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తున్నామన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఏటా అక్టోబర్‌లో రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రొమ్ము క్యాన్సర్ లక్షణాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. చైతన్య ప్రవంతి ప్రతినిధులు విజయ, రుకీయభాను, శారద, అనసూయ పాల్గొన్నారు.

ఏపీ జీఎన్‌ఏ రాష్ట్ర కోశాధికారిగా గంగాభవానీ

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా టి. గంగాభవానీ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి గంగాభవానీ పోటీ చేయగా అత్యధిక మెజార్టీతో గెలిచి కోశాధికారి పదవి కైవశం చేసుకున్నారు. విశాఖ జిల్లా ఏపీజీఎన్‌ఏ జిల్లా అధ్యక్షురాలిగా కూడా ఇటీవల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్రస్థాయిలో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండాలనే లక్ష్యంతో ఆమె పోటీ చేయగా కీలక స్థానం లభించింది. గంగాభవానీ నియామకం పట్ల విశాఖ జిల్లా నర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. ఇందిర, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, కోశాధికారి వంశీ, పాలకవర్గ సభ్యులు, పలు ఆస్పత్రులకు చెందిన నర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మాస్టర్స్ స్విమ్మింగ్‌లో ఈశ్వర్‌కు మూడు స్వర్ణాలు



ఈశ్వరరావు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర జిల్లాల మాస్టర్స్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో విశాఖకు చెందిన మాస్టర్ స్విమ్మర్ పి.ఈశ్వరరావు మూడు స్వర్ణాలు సాధించాడు. ఈ పోటీలు గుంటూరులోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం జరిగాయి. వంద మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల బాక్ స్ట్రోక్, ఫ్రీస్టయిల్ అంశాల్లో విజేతగా నిలిచి పతకాలందుకున్నాడు.

వైఎస్సార్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి వసతులు

- ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్ వెల్లడి



ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌ను సత్కరిస్తున్న శివనాథ్

విశాఖ స్పోర్ట్స్ : ఆటగాళ్లకు మెరుగైన శిక్షణ అందించేందుకు ఇటీవల బీసీసీఐ ఆధ్వర్యంలో బెంగళూర్‌లో ప్రారంభించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తరహా సెంటర్లను ఏసీఏ సౌత్,నార్త్, సెంట్రల్ జోన్‌లలో ఏర్పాటు చేస్తామని ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ వెల్లడించారు. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులు కల్పిస్తామన్నారు. స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో యువతలో క్రికెట్ స్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. విశాఖ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఏసీఏకు నూతనంగా ఏర్పడిన అపెక్స్ కౌన్సిల్ ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల క్రికెట్ సంఘాల ప్రతినిధులతో అపెక్స్ కమిటీ భేటీ అయింది. క్రికెట్ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించింది. స్థానికంగా ఉన్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్యదర్శి సానా సతీష్ హామీ ఇచ్చారు. విజయనగరంలోని నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీని ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సౌత్, సెంట్రల్ జోన్ పరిధిలోని జిల్లాల ప్రతినిధులతో అపెక్స్ కౌన్సిల్ కమిటీ సోమవారం భేటీకానుందని వివరించారు.

ఐ లీగ్ ఫుట్‌బాల్ తరలింపు సరికాదు

- ఏపీ ఫుట్‌బాల్ సంఘ అధ్యక్షుడు గోపాలకృష్ణ

విశాఖ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మక ఐ లీగ్ ఫుట్‌బాల్ విశాఖ వేదికగా నిర్వహించేందుకు ఎంతో శ్రమిస్తే ఇప్పుడది హైదరాబాద్‌కు తరలిపోవడం శోచనీయమని ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలోనే ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్‌ఎఫ్) ద్వారా విశాఖ వేదికగా నిర్వహించేందుకు లైసెన్స్ దక్కిందన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ పేరిట విశాఖలో ఫుట్‌బాల్ అభివృద్ధికి, స్థానిక క్రీడాకారుల ప్రోత్సాహానికి ఐ లీగ్ ఎంతో దోహదపడగలదని పేర్కొన్నారు. విశాఖ ట్రోఫీకి ఎంతో గుర్తింపు ఉందని, దాని ఆధునిక వెర్షన్‌గా ఐ లీగ్ ఆడనుందన్నారు. ఫుట్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ఐ లీగ్ నిర్వహిస్తుండగా, ఇందులో ఆడే క్రీడాకారులు దేశంలోనే మేటి క్లబ్స్‌కు ఆడేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అనధికార ఫుట్‌బాల్ సంఘం విషయమై కోర్టులో వాదనలు జరిగి తీర్పు వెలువరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి సమయంలో విశాఖ వేదికగా జరగాల్సిన ఐ లీగ్ హైదరాబాద్‌కు తరలిపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. విశాఖ వేదికగా ఫుట్‌బాల్ అభివృద్ధికి పాటు పడాల్సిన ఎస్ఎఫ్‌సీ కరోనా అనంతరం ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనుల్ని ప్రారంభించలేదన్నారు. ఇప్పటికే హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ పేరిట ఐఎస్‌ఎల్‌లో జట్టు ఆడుతుందన్నారు. విశాఖలో కార్యకలాపాలు నిర్వహించాల్సిన ఎస్ఎఫ్‌సీ హైదరాబాద్‌కు తరలిపోవడం, ఒకే ప్రాంతంలో రెండు క్లబ్‌లు.. ఫుట్‌బాల్ సమాఖ్యను తప్పుదారి పట్టించడమే అన్నారు.

పెళ్లి రద్దయిందని యువకుడి ఆత్మహత్య

మధురవాడ : పెళ్లి రద్దయిందని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దెల్లో ఢిల్లీరావు కొమ్మాది సమీపంలోని సేవానగర్ 28వ బ్లాక్‌లో నివాసం ఉంటూ వైజాగ్ లా కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య కూలి పనులు చేస్తూ కుటుంబ పోషణలో చేదోడు వాదోడుగా ఉంటుంది. చిన్న కుమారుడు గోపాల్ చంద్రంపాలెంలోని ఓ షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి ఈ ఏడాది ఆగస్టు 9వ తేదీన ఒడిశా రాష్ట్రం కొమ్మూరుకు చెందిన చంద్రమ్మతో నిశ్చితార్థం జరిగింది. ముహూర్తాల విషయం ఢిల్లీరావు వధువు తల్లికి ఫోన్ చేసి అడగ్గా వివాహ ప్రతిపాదన విరమించుకున్నట్టు చెప్పింది. దీంతో గోపాల్ నిరాశకు గురయ్యాడు. ఇంటి ఎదురుగా అద్దెకు తీసుకొన్న ఎఫ్–1 ఫ్లాట్‌కు శనివారం రాత్రి భోజనం చేసి నిద్రపోయేందుకు గోపాల్ వెళ్లాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఫ్లాట్‌కు తండ్రి వెళ్లి కుమారుడిని పిలవగా ఎంతకీ పలకలేదు. పైగా లోపల గడియ పెట్టి ఉంది. తలుపు విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా గోపాల్ చున్నితో శ్లాబ్ హుక్కుకు ఉరివేసుకుని కనిపించాడు. వివాహం రద్దు కావడంతో జీవితంపై విరక్తితోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తండ్రి ఢిల్లీరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.